

శాస్త్రీయ సమాజ స్థాపనతోనే పురోగతి : జెవివి

ప్రజాశక్తి - కడప అర్బన్ : శాస్త్రీయ సమాజ స్థాపనతోనే సమాజం పురోగతిని సాధిస్తుందని జెవివి జిల్లా అధ్యక్షులు షామీర్‌బాషా పేర్కొన్నారు. ఫిబ్రవరి 28 , 1988 సంవత్సరంలో జన విజ్ఞాన వేదిక (ఆంధ్రప్రదేశ్) ఆవిర్భవించిందని జిల్లా అధ్యక్షులు షామీర్ బాష తెలిపారు. జనవిజ్ఞాన వేదిక ఇప్పటిదాకా రాష్ట్రంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడం కోసం విద్య, ఆరోగ్యం, అభివృద్ధి, పర్యావరణం, మూఢ నమ్మకాలు మొదలైన అంశాలపై నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఎందరో మేధావులు తమ సమయాన్ని కేటాయించి వ్యయప్రయాసాల కోర్చి ఈ సంస్థలో పని చేస్తున్నారని తెలిపారు. విశ్వాసాన్ని, సైన్సును కలగాపులగం చేయ రాదని పేర్కొన్నారు. సైన్సు సార్వత్రికం, విశ్వాసాలు వ్యక్తిగతమని తెలిపారు. పరిశీలించడం, ప్రశ్నించడం, రుజువు చేయడం, సిద్ధాంతీకరించడం ఇది సైన్సు అంటే అనే తాత్విక పునాదితో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని తెలిపారు. నేటి సమాజంలో జన విజ్ఞాన వేదిక లాంటి సంస్థల అవసరం చాలా ఎక్కువగా ఉందని పేర్కొన్నారు.

ఆశల బడ్జెట్



- 'పయ్యావుల'పైనే భరోసా
- 'ఉక్కు' పరిశ్రమకు ఊతమిచ్చేనా
- రూ.3,622 కోట్లతో ఇరిగేషన్ ప్రతిపాదనలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌పై ఆశలన్నీ నిలిచాయి. 2025-26 వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలోని సాగునీటి పారుదల ప్రాజెక్టులు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల కేటాయింపులపై అందరి దృష్టి నిలిచింది. మూడేళ్ల కింద నుంచి పారిశ్రామికానికి మౌలిక వసతుల కల్పనలో కదలిక వచ్చినప్పటికీ పూర్తి స్థాయిలో కల్పించని పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా జిల్లా పారిశ్రామిక ప్రగతి నత్తనడకన సాగుతోంది. జిల్లా నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని 37 సాగునీటి ప్రాజెక్టుల్లో తొమ్మిది ప్రాజెక్టులకు రూ.3,622.88 కోట్లతో ప్రతి పాదనలు పంపించింది. రాయలసీమ మిటిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 ప్యాకేజీ పనులు, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతలు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, రాజోలు, జొలదరాశి, యురేనియం బాధిత గ్రామాలకు తాగు నీటి సరఫరా ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామనే హామీ నేపథ్యంలో 2018 ఫిబ్రవరిలో జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండల పరిధిలోని కంబాలకుంటలో శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అనంతరం 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఉక్కు పరిశ్రమను మూడేళ్లలో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చని సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు జిల్లా ప్రజానీకం పట్టం కట్టింది. ఈ అవకాశాన్ని కూటమి నాయకత్వం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ప్రభుత్వం జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్ని రివర్స్ టెండరింగ్ పేరుతో నిలిపివేసిన విషయం తెలిసిందే. అనంతరం ప్యాకేజీ-1, ప్యాకేజీ-2 ప్యాకేజీ-3 పనులకు టెండర్లు నిర్వహించడం మినహా మిగిలిన ప్యాకేజీ-4, ప్యాకేజీ-5, ప్యాకేజీ-6, ప్యాకేజీ-7 పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయింది. రూ.1357 కోట్లతో రాజోలి, రూ.1312 కోట్లతో జొలదరాశి, రూ.564 కోట్లతో కుందూ-పెన్నా ఎత్తిపోతల, రూ.5 వేల కోట్లతో కాలేటివాగు ఎత్తిపోతల పథకం భూసేకరణ అడ్డంకుల కారణంగా ముందుకు సాగడం లేదు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్, కొప్పర్తి పైప్‌లైన్ల పనులు సాకా రానికి నోచుకోలేదు. జిల్లా వ్యాప్తంగా గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వాసితులను గాలికి వదిలేసింది. గండికోట నిర్వాసితులకు పెంచిన పరిహారం ఎప్పటికి అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ, చిత్రావతి, సర్వరాయసాగర్ రిజర్వాయర్ల లీకేజీ పనులు దశాబ్దాల తరబడి నిరీక్షిస్తుండడం తెలిసిందే. తెలుగుగంగ ఇంజనీరింగ్ యంత్రాంగం తాజాగా రూ.90 కోట్ల మేరకు ప్రతిపాదనలు పంపించింది. తాజా బడ్జెట్‌లో సాగునీటి, పారిశ్రామిక ప్రాజెక్టులైన జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, కడప ఉక్కు పరిశ్రమ, రాయలసీమ ఎలక్ట్రికల్ మాన్యుఫక్చరింగ్ హబ్‌గా మార్చడానికి సంబంధించిన కేటాయింపులు ఏమేరకు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.



పోసానిని ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఓబులవారిపల్లెలో ఉద్రిక్తత

- పిఎస్ వద్ద వైసిపి శ్రేణులను అడ్డుకున్న పోలీసులు
- న్యాయవాదులనూ అనుమతించలేదు
- పోసానిని 9 గంటలు విచారించిన ఎస్పి
- రైల్వేకోడూరు కోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- పోలీసు స్టేషన్‌లోనే పోసానికి వైద్య పరీక్షలు
- ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవన్న వైద్యుడు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు/పుల్లంపేట

వైసిపి నేత, సినీనటుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌కు గురువారం మధ్యాహ్నం తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని రాయదుర్గంలో మై హోం భుజా అపార్ట్‌మెంట్‌లో అదుపులోకి తీసుకున్న తర్వాత నేరుగా ఓబులవారిపల్లెకు తీసుకొచ్చారు. ముందుగానే విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, పార్టీ శ్రేణులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఓబులవారిపల్లి పిఎస్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. పోసానిని కలుసుకునేందుకు వైసిపి నాయకులు పట్టుపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. పోసాని తరపున వచ్చిన న్యాయవాదులను సైతం అనుమతించలేదు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పోసానిని అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు విచారించారు. 9 గంటల పాటు విచారించారు. పోలీసులకు పోసాని ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, మౌనంగా కూర్చున్నారని పోలీసులు చెబుతున్నారు. విచారణకు సహకరించలేదని చెబుతున్నారు. పోసాని నోరుమెదిపితే విచారణ ముందుకు సాగుతుందని అంటున్నారు. పోలీసులు ఏర్పర్చ అడిగినా తెలియదు, గుర్తులేదు, అవునా అంటూ సమాధానాలు దాటవేస్తున్నారు. మీడియా సమావేశంలో మాట్లాడిన వీడియోలు ముందు పెట్టి ప్రశ్నించారు... ఎవ్ యు రాజా అంటూ తనదైన శైలిలో పోసాని ప్రవర్తిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. మధ్యాహ్నం నుంచి ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. సాయంత్రం రైల్వేకోడూరు కోర్టులో పోసానిని హాజరుపరుస్తున్నారని ప్రచారం జరిగింది. పోలీస్‌స్టేషన్‌లోనే ఆయనను కలిసేందుకు వచ్చిన పోసాని తరపు న్యాయవాదులను పిఎస్‌లోకి అనుమతించలేదు. కోర్టుకు హాజరుపర్చితే కృష్ణ మురళి తరపున వాదనలు వినించేందుకు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి రైల్వేకోడూరులోనే ఉన్నారు. పిఎస్‌లో పోసానిని కలిసేందుకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన తరపు న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో హైకోర్టులో రిట్ పిటిషనల్ వేస్తామని వైసిపి నాయకులు, న్యాయవాదులు పేర్కొంటున్నారు. పోలీస్‌స్టేషన్‌లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేష్ ఆధ్వర్యంలో పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆతనికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. పోలీసు విచారణకు ఆరోగ్య సమస్యలు ఎదురుకావని పేర్కొన్నారు. కాగా ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యక్తిగత దూషణ వంటి అభియోగాలపై బిఎన్ఎస్‌లోని 196, 353(2), 111 రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదైంది. రాత్రి 9.45 గంటలకు రైల్వేకోడూరు కోర్టులో పోసానిని హాజరుపర్చారు.

రాష్ట్రంలో అరాచక రాజ్యమేలుతోంది : 'కొరముట్ల'

రైల్వేకోడూరు : రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం రాజ్యమేలుతోందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు ఆరోపించారు. ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో నటుడు పోసాని కృష్ణ మురళిని కలిసేందుకు వచ్చిన కొరముట్లను పోలీసులు అనుమతించలేదు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోసాని కొన్ని నెలల క్రితమే రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారన్నారు. పోసానికి ఏమైనా హాని జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత అని తెలిపారు. పోలీసులు హద్దులు అతిక్రమించి అక్రమంగా వ్యవహరిస్తే న్యాయపరమైన ఇబ్బందులకు వెళ్లాల్సి వస్తుందని, ఎవరిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

రాయచోటి: రాష్ట్రంలో అరాచకం కట్టలు తెంచుకుంటోందని, సిఎం చంద్రబాబు నాయుడు నియంత పాలన చేస్తున్నారని రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కక్షలతో రాజకీయ ప్రత్యర్థులను, కళాకారులను, విశ్లేషకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. పోసాని అరెస్టుతో చంద్రబాబు నాయుడి కక్ష రాజకీయాలు పతాక స్థాయికి చేరాయన్నారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీస్ అధికారులు బలి పశువులు కావద్దని హితవు పలికారు.

నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైఎస్ఆర్ జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధ్వర్యంలో నాటుసారా నిర్మూలనా కార్యక్రమం 'నవోదయం 2.0'పై ఎస్‌పి అశోక్ కుమార్, డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడుతో కలిసి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటుసారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. వైఎస్ఆర్ జిల్లా చుట్టూ చాలా సరిహద్దు ప్రాంతాలను కలిగి ఉండడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు మరింత సూక్ష్మ దృష్టిని సారించాలని పేర్కొన్నారు. నవోదయం 2.0పై డివిజన్, గ్రామస్థాయి సమావేశాలను నిర్వహించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాటుసారా వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, ఆర్థిక దుష్ప్రభావాలను వివరించాలని చెప్పారు. నాటుసారా సేవించడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో విస్తృత అవగాహన పెంచాలన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో ఎక్కువగా నాటుసారా తయారీ జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. జిల్లాలో నాటుసారా నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసు అనుబంధ శాఖలు పారదర్శకంగా, కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్, డిఐపిఆర్ఒ పి.వేణుగోపాల్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, అటవీ, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమూల్ డెయిరీకి తాళం

- టిడిపి నాయకుల బరితెగింపు
- సాయంత్రం వరకు హైడ్రామా

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



లింగాల మండల పాల డెయిరీ మూసివేత వ్యవహారం కలకలం రేపింది. గురువారం టిడిపికి చెందిన కొందరు నాయకులు సొంతంగా పాల వ్యాపారాలు నిర్వహించాలనే ఉద్దేశంతో అమూల్ సంస్థను మూతవేశారనే ఆరోపణలున్నాయి. సమాచారం తెలుసుకున్న జిల్లాకు చెందిన అమూల్ సంస్థ ఉన్నతాధికారులు హుటాహుటనా సంఘటనా స్థలానికి చేరుకుని అందుకు కారణమైన టిడిపి నాయకులతో సంప్రదింపులు చేయడంతో అమూల్ డెయిరీ తాళాలు అప్పగించారు. దీంతో పాల వ్యాపార కార్యకలాపాలు తిరిగి ప్రారంభానికి నోచుకోవడం ఉపశమనం కలిగింది. ఏదేమైనా రాష్ట్రంలోనే అధిక మొత్తంలో లింగాల మండలంలో పాల లావాదేవీలు సాగుతున్న సంగతి తెలిసిందే. ఇటువంటి పాల వ్యాపారాన్ని అడ్డుకునేందుకు బరితెగ్గించడం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తం అవుతోంది.

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : పటేల్ రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్లో 30 రోజుల పాటు యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను మార్చి 1నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కల్పన, డాక్టర్ రంగనాథ రెడ్డి, ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్, సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు మూడవ బ్యాచ్ ఉంటుందని, వివరాలకు 848861206, 7013238986లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - కడప : జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మూడు నెలలు పాటు పొడిగించినట్లు కడప సమాచార శాఖ డిఐపిఆర్ఒ వేణుగోపాల్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి మే 31 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని పేర్కొన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యం వారి సంస్థలో తొలగించిన జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

నేడు శ్రీసాయి విజ్ఞాన్ పాఠశాల రజతోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఎంతోమంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తునిచ్చిన శ్రీ సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 25 ఏళ్ల పూర్తి చేసుకుని రజతోత్సవ వేడుకలు ఈ నెల 28 నిర్వహిస్తున్నట్లు పాఠశాల వ్యవస్థాపకులు బి.మైథిలి, బి. భూపతి వెల్లడించారు. గురువారం సాయంత్రం పాఠశాల ఆవరణంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలోని అరవింద నగర్‌లో 1999న ప్రారంభించిన పాఠశాల 2009 నాటికి వివేకానంద నగర్‌లో సొంత భవనాలతో నూతన ప్రాంగణంలోనికి అడుగు పెట్టామని చెప్పారు. క్రమశిక్షణతో కూడిన, ఆధునిక సమాజ అవసరాలను తీర్చేలా శాస్త్రీయ, సాంకేతిక విద్యను అందిస్తూ, పరిమిత సంఖ్యలో విద్యార్థులను చేర్చుకుని, ప్రతి విద్యార్థి పట్ల బాధ్యతయుక్తమైన శ్రద్ధతో వారి పురోగతిని శ్రమించడమే తమ లక్ష్యంగా ముందుకెళ్లామన్నారు. . ఆదిత్య ఫంక్షన్ హాల్ లో రజతోత్సవ నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యుడు ఎం.వి. రామచంద్రారెడ్డి, గౌరవ అతిథులుగా జెసి అదితి సింగ్, వైవీయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఫిజిక్స్ ప్రొఫెసర్ కె.కృష్ణా రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులుగా సిబిఐ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీ నారాయణ హాజరవుతున్నారని తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న జూనియర్ అసిస్టెంట్ సర్వీస్ మేటర్స్‌లో నగదు డిమాండ్ చేయడంపై ప్రాథమిక విచారణలో నిజమని తేలిన నేపథ్యంలో ఆయన్ను సస్పెండ్ చేసినట్లు కమిషనర్ మనోజ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరపాలక సంస్థలో ఎటువంటి అవినీతి కార్యకలాపాలకు తావులేదని, ఇలాంటి ఘటనలకు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నగర ప్రజలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎవరైనా అవినీతి లేదా ఇతర ఇబ్బందులను ఎదుర్కొంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెంటనే తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి : జెసి


ప్రజాశక్తి- కడపఅర్బన్: విద్యార్థులు ఆత్మహత్యలు మాని బతికి సాధించాలని, ఉన్నత లక్ష్యాలతో బంగారు భవిష్యత్తును ఎంచుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. గురువారం 'ఆత్మహత్యలు వద్దు - బతికి సాధిద్దాం' అని టిఎన్ఎస్ఎఫ్ రూపొందించిన పోస్టర్లను గురువారం ఆమె కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ విద్యార్థులు అనవసరమైన భయాందోళనలు, అవమానాలు, చదువు ఒత్తిడి వీటితో ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తొందరపాటు నిర్ణయాలతో ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని చెప్పారు. మంచిగా చదువుకుని వివిధ రంగాలలో నిష్ణాతులుగా తయారై, ఉజ్వల భవిష్యత్తును పొంది తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి హమీద్, కార్యదర్శి అక్షయ్ కుమార్ రెడ్డి, నాయకులు బిల్లా నవీన్, రఘు, లక్ష్మణ్, ఫక్రుద్దీన్, జాకీర్ పాల్గొన్నారు.

వైవీయూలో ఉత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల వార్షికోత్సవం, వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కళాశాల అంతర విభాగ క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. క్రీడా పోటీలను కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. రఘునాథరెడ్డి, క్రీడా బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య, క్రీడల విభాగాధిపతి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ప్రారంభించారు. ఉత్సాహపూరితమైన వాతావరణంలో వైవీయూలోని అన్ని విభాగాల అధ్యాపకులు, బోధ నేతర సిబ్బంది, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొనడం సంతోషకరమని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. మొదటిరోజు క్రీడలలో విద్యార్థుల క్రికెట్ విభాగంలో లైఫ్ సైన్సెస్-1, లైఫ్ సైన్సెస్-2 తలపడగా లైఫ్ సైన్సెస్-2 విజయం సాధించింది. అనంతరం హ్యుమానిటీస్, ఇంటిగ్రేటెడ్ జట్లు తలపడగా ఇంటిగ్రేటెడ్ జట్టు విజయం సాధించింది. పరిశోధక విద్యార్థులు విభాగంలో సైన్స్ స్కాలర్స్ జట్టు మొదటి స్థానంలో, లెజెండ్ స్కాలర్స్ జట్టు రెండవ స్థానంలో నిలిచాయి. విజేతలను ప్రిన్సిపల్, క్రీడా విభాగాధిపతి అభినందించారు.

కరూర్ వైశ్య బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి -కడప అర్బన్



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్

కరూర్ వైశ్య బ్యాంక్ నూతన శాఖలలో భాగంగా ప్రొద్దుటూరులో శాఖను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో 873వ బ్రాంచ్‌గా ఏర్పాటు చేసిన ఈ శాఖను ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు, కరెంట్ ఖాతాలు సహా డిపాజిట్లు, రుణాలు వంటి సమగ్రమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తుందని బ్యాంకు ప్రతినిధి చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో, బ్యాంక్ 35 శాఖలను ఏర్పాటు చేసిందన్నారు. బ్యాంకు ఇప్పుడు 877 శాఖలను కలిగి ఉందన్నారు. కొత్త శాఖలు అన్ని ప్రాథమిక బ్యాంకింగ్ లావాదేవీలను, కస్టమర్ల నిర్దిష్ట అవసరాలను తీర్చగలవని, రిటైల్, సంస్థాగత వినియోగదారుల రుణాలను అందిస్తుందని పేర్కొన్నారు. బ్యాంకింగ్ ఉత్పత్తులు, ఆర్థిక సేవల కు సంబంధించిన మొత్తం సేవలను అందిస్తాయన్నారు. కెవిబి ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ సౌకర్యాలను అందిస్తుందన్నారు. బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ యాప్ అయిన కెవిబి డిలైట్ 150కి పైగా ఫీచర్ల ద్వారా ఆర్థిక, ఆర్థికేతర సేవల సౌలభ్యాన్ని అందిస్తుందని తెలిపారు.

45వ డివిజన్‌లో గుంతలను పూడ్చండి

ప్రజాశక్తి - కడప అర్బన్



గుంతకారణంగా రోడ్డు పాలైన అంగన్వాడీ కోడిగుడ్లు

45వ డివిజన్ భగత్ సింగ్ నగర్ మెయిన్‌రోడ్డులో 6 నెలల కిందట మంచినీటి పైప్‌లైన్ కోసం కాలువ తీసి పైప్‌లైన్ వేసి గుంతలు పూడ్చకుండా వదిలివేసిన కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి. దస్తగిరి రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పైప్ లైన్ వేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్‌నగర్‌లో ప్రజల కోసం పైప్‌లైన్ వేసిన కాలువ గుంతను దాటుకుని పోవాలంటే తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు స్కూటర్ల నుంచి కిందపడి దెబ్బలు తగిలాయని తెలిపారు. ఇటీవల అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలకు వచ్చే కోడిగుడ్లు సరఫరా చేసే ఆటో కూడా కాలువ గుంతలో పడి దాదాపు 500 గుడ్లు పగిలిపోయాయని చెప్పారు. గుంతలు పూడ్చమని ఆ కాలనీ ప్రజలు సంబంధిత కాంట్రాక్టర్ దృష్టికి అనేక సందర్భాల్లో విన్నవించినా 'చూస్తాం, చేస్తామని' అంటూ కాలం వెలుబుచ్చు తున్నారని విమర్శించారు. ఈ విషయంపై కార్పొరేషన్ జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పైప్ లైన్ కోసం వేసిన గుంతలను పూడ్చాలని, లేనిపక్షంలో భగత్ సింగ్ నగర్ ప్రజలను కలుపుకుని ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో భగత్ సింగ్ నగర్ సిపిఎం నాయకులు ఎం.పాపిరెడ్డి, స్థానికులు చోటాపీర్, రమణ పాల్గొన్నారు.

శాస్త్రీయతను పెంపొందిస్తుంది

ప్రజాశక్తి - కడప : విద్యార్థుల్లో శాస్త్రీయతను పెంపొందించడంలో సైన్స్ దినోత్సవం ఎంతగానో తోడ్పడుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. గురువారం జాతీయ సైన్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ పురుషుల కళాశాలలోని సైన్స్ విభాగాల వారు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. 'సమాజ అభివృద్ధిలో టెక్నాలజీ పాత్ర'అనే అంశం పైన వక్తృత్వపు పోటీలు, జనరల్ సైన్స్, బయోటెక్నాలజీ పైన క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ సైన్సు దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులలో శాస్త్రీయతను పెంపొందించటంలో ఇటువంటి కార్యమాలు తోడ్పడుతాయని పేర్కొన్నారు. జంతు శాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో వక్తృత్వపు పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను సైన్స్ దినోత్సవం రోజు ప్రదానం చేస్తారని డాక్టర్ వై.సావిత్రి తెలిపారు. క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన రెండు టీమ్‌లను డాక్టర్ బి.రాజేశ్వరి అభినందించారు. కార్యక్రమంలో కల్పన, రామచంద్ర, సురేష్, మహేష్, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, షాహీన్, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో అధ్యాపకులు

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ

ప్రజాశక్తి - కడప : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, రెడ్ బుక్ రాజ్యం నడుస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విమర్శలను కూటమి ప్రభుత్వం తట్టుకోలేక పోతుంది అన్నారు. అందుకే పోసాని అరెస్టు చేశారని తెలిపారు. ప్రజల రక్షణకు కాకుండా రాజకీయ పక్షులకు పోలీసులను కూటమి ప్రభుత్వం వాడుకుంటుందన్నారు. పోసాని అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన కక్ష సాధింపు చర్యలు అమలు చేస్తున్నారు అన్నారు. రాత్రి సమయంలో ఆరోగ్యం బాగాలేదని చెబుతున్నా పట్టించుకోకుండా అరెస్టు చేయడం దారుణం అన్నారు. ప్రభుత్వ అవినీతిని లేవనెత్తితే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ప్రజలకు రక్షకులుగా ఉండాల్సిన పోలీసులను రాజకీయ కక్షలకు వాడుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.

2న అట్లూరు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అట్లూరు

మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 10:30 గంటలకు అ స్థానిక స్త్రీశక్తి సభా భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ భాస్కర్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిపి, జడ్‌పిటిసి, సర్పంచులు, ఎంపిటిసిలు ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో భవిష్యత్‌లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

2న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వల్లూరు కడప -తాడిపత్రి జాతీయ రహదారి గణేష్‌పురం వద్ద మార్చి 2న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అభ్యుదయ ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కడప మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్లు వంశీ విహారి, డాక్టర్ సాయి చరిత సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. వైద్య శిబిరంలో కేన్సర్, రక్తహీనత, విషజ్వరాలు, కీళ్ల నొప్పులు చికిత్సలు అందిస్తారన్నారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అభ్యుదయ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిర్వాహకులు తెలిపారు.

కమలాపురం టౌన్ : స్థానిక స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రైమ్ హాస్పిటల్స్ వైద్యులు మహేష్ బృంగి సహకారంతో మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మార్చి 2న ఎముకలు, కీళ్లు, నరాల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ రామసుబ్బారెడ్డి, మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్ కుమార్ తెలిపారు.

రైతు సేవా కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి - గోపవరం

బద్వేల్ మండలంలోని చింతల చెరువులో రైతు సేవా కేంద్రాన్ని వ్యవసాయ సంచాలకులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్షించారు. రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు, రైతుల ఇకెవైసి ప్రక్రియను 3లోగా పూర్తి చేసి సామాజిక తనిఖీకి సిద్ధంగా ఉండాలని సూచించారు. సచివాలయం సిబ్బంది, గ్రామ కార్యదర్శితో కిచెన్ గార్డెన్ ఏర్పాటు, హోం కంపోస్టింగ్‌పై చర్చించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పశు వైద్య విద్యార్థులు

వైద్య విద్యలో అసమానతలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైద్య విద్యలో స్టయిఫండ్ విషయంలో అసమానతలు లేకుండా చడాలని పశువైద్య విద్యార్థులు కోరారు. ఎంబిబిఎస్ విద్యార్థుల వలె తమకు స్టయిఫండ్ పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా పశు వైద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభు త్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. స్థానిక గోపవరం పంచాయతీలోని పశు వైద్య కళాశాలలో చేపట్టిన దీక్షలు గురువారానికి 25వ రోజుకు చేరుకున్నాయి.

మొదటి స్థానంలో మైదుకూరు ఎద్దు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలలో మైదుకూరుకు చెందిన కుర్రా వెంకటేష్ యాదవ్ ఎద్దు 2049 అడుగులు లాగి మెదటి బహుమతి రూ.1,00,116 గెలుచుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో బండలాగడు పోటీలను నిర్వహించారు. పోటీలను ఆలయ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం విజేతలుగా నిలిచిన ఎద్లకు బహు మతులు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, కెసి కెనాల్ డిస్ట్రి బ్యూటరీ వైస్ చైర్మన్ గురివి రెడ్డి, టిడిపి నాయకులు మేకల బాబు, వీర నారాయణ యాదవ్, శేఖర్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

మహాశివరాత్రి సందర్భంగా వీరపునాయునిపల్లె మండలం అనిమెల శ్రీసంగమేశ్వరాలయాన్ని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి సం దర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్లచే బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంగమేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ నరెడ్డి మురళీమోహన్ రెడ్డి, ఆలయ ప్రధాన ఆర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, ఓబులేసు, నాగార్జునరెడ్డి, శివ ప్రసాద్‌రెడ్డి, రఘునాథరెడ్డి, సంగమేశ్వరరెడ్డి, సదాశివారెడ్డి, వాసుదేవరెడ్డి, ఓబయ్య, భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, నాగరాజు, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, రమణ, రాజు, వినయ్ పాల్గొన్నారు.

గంగమ్మ తిరుణాలలో అపశృతి

- సిరిబండి చక్రం కింద పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మండలంలోని తుమ్మలపల్లె గ్రామంలో గురువారం గంగమ్మ తిరుణాల సందర్భంగా సిరి బండి లాగుతున్న సమయంలో అపశృతి చోటుచేసుకుంది. శివరాత్రి పండుగ తర్వాత తుమ్మలపల్లె గ్రామం నుంచి సిరిబండితో బ్యాండు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహిస్తూ గంగమ్మ చింతల చేరుకొని అమ్మవార్లకు మొక్కులు తీర్చుకునే సంప్రదాయం ఆనవాయితీ. సిరిబండి గ్రామం నుండి బయలుదేరిన సమయంలో తుమ్మలపల్లె గ్రామానికి చెందిన ఆర్ సుదర్శన్(60) అనే వ్యక్తి తోపులాటలో సిరిబండి చక్రం కింద పడిపోయాడు. సిరి బండి చక్రం సుదర్శనం నడుముల మీద పోవడంతో నడుములు విరిగి స్పృహ కోల్పోయాడు. వెంటనే గ్రామస్తులు అతన్ని ఆసుపత్రికి తరలించే సమయంలో సుదర్శనం మృతి చెందాడు. సుదర్శనం ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. రెండేళ్ల క్రితం సిరి బండి ఉత్సవంలో చక్రం క్రిందపడి తుమ్మలపల్లె గ్రామానికి చెందిన జెడ్పిటిసి మహేశ్వర్‌రెడ్డి మృతి చెందిన విషయం విధితమే. సిరి బండి ఉత్సవం గ్రామస్తులకు విషాదంగా మారింది.

అల్లాడుపల్లెలో వృద్ధుడు మృతి

చాపాడు : అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన ఆవరణలో వి.వెంగయ్య శెట్టి (72) మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. శివరాత్రి ఉత్సవాలకు అల్లాడుపల్లెకు వచ్చి మృతి చెందాడు. మృతదేహం వద్ద ఉన్న వివరాలను గమనించి బంధువులకు సమాచారం అందజేశారు. అనారోగ్య కారణంతో చనిపోయినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైం కార్నర్

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురై యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల ప్రాథమిక సమాచారం మేరకు.. మృతుడు కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలం కాకరవాడకు చెందిన దండే హరీష్‌రెడ్డి (28) అన్నారు. ఉద్యోగం రాకపోవడంతో కలత చెంది ఆత్మహత్య చేసుకున్నారని సమాచారం వచ్చిందన్నారు. ధర్మవరం-మచిలీపట్నం రైలు కింద పడి గురువారం తెల్లవారు జామున ఆత్మహత్య చేసుకున్నాడు. తల, మొండెం రెండు వేరయ్యాయి.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - గోపవరం

జిల్లా ప్రొఫెషన్, అండ్ ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు బద్వేల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సీతారామరెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఇన్స్పెక్టర్ నీలకంఠేశ్వర్ రెడ్డి మండలంలోని కుంట చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేయగా, ముగ్గురు వ్యక్తులను ఒక ద్విచక్ర వాహనాన్ని, 850 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు.. నాయుడుపేటకు చెందిన ఒక వ్యక్తిని అరెస్టు చేసి వారి దగ్గర నుండి 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేటకు చెందిన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు ఈ కేసులోని మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయవలసి ఉందని సిఐ సీతారామరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్ కానిస్టేబుల్ ఎవి కృష్ణారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కానిస్టేబుల్ నారాయణ, స్టేషన్ సిబ్బంది రంగస్వామి, బాల యేసు, కానిస్టేబుల్ కొండలరావు, పెద్ద హుస్సేన్ వలి, గురయ్య, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తోళ్లగంగన్నపల్లిలో చోరీ

- నగలు, నగదు అపహరణ

ప్రజాశక్తి - వల్లూరు

కడప-తాడపత్రి జాతీయ రహదారిపై ఉన్న తోళ్లగంగన్నపల్లి గ్రామంలో ఓ ఇంటిలో చోరీ జరిగింది. 13.5 తులాల బంగారు, రూ.2.5 లక్షల నగదును దోచుకెళ్లారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. తోళ్లగంగన్నపల్లి గ్రామానికి చెందిన మామిళ్ల గురివిరెడ్డి కుటుంబ సమేతంగా బుధవారం శివరాత్రి పండుగ సందర్భంగా జిల్లాలోని అల్లాడుపల్లె దేవళాలకు వెళ్లారు. ఇంటిలో ఎవరు లేరని విషయం తెలుసుకున్న దుండగులు ఇంటి మెయిన్ డోర్ లాక్ పగలగొట్టి లోనికి వెళ్లి చోరీకి పాల్పడ్డారు. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న గురివిరెడ్డి డోర్ లాక్ పగలగొట్టి ఉండడంతో ఇంటిలో పరిశీలించారు. దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలాన్ని కమలాపురం సిఐ రోషన్ పరిశీలించారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సిఐ రోషన్

తగ్గిన దిగుబడి, ధర.. శనగ రైతుల్లో దిగాలు

ప్రకృతి వైపరీత్యాలతో రాలిన పూత - కొనుగోలు కేంద్రం ప్రారంభించని ప్రభుత్వం - దళారులదే పెత్తనం - గోడౌన్లలో దాచుకుంటే అదనపు ఖర్చు


పొలంలో శనగ పంటను నూర్పిడి చేస్తున్న రైతు కొండారెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

శనగకు ధర తగ్గడంతో సాగు చేసిన రైతుల్లో దిగాలు పట్టుకుంది. వ్యయప్రయాసాలకోర్చి శనగ పంటల సాగు చశామని, దిగుబడి తగ్గిందని వాపోతున్నారు. దిగుబడి తగ్గడమేకాక శనిగను కొనేవారు లేరని పేర్కొంటున్నారు. ఇదే అదునుగా దళారులు తక్కువ ధరకు తమనుంచి కొనుగోలు చేసి లబ్ధి పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరాకీ లేక వేర్‌హౌస్ గోడౌన్లలో లక్షలాది శనిగ మూటలు నిల్వ పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. ఎర్రగుంట్ల మండల వ్యాప్తంగా 12,375 ఎకరాల్లో శనగ పంట సాగులో ఉంది. గతేడాది అక్టోబర్, నవంబర్‌లో రైతులు సాగు చేశారు. డిసెంబర్‌లో పంట పూత దశలో ఉండగా, అకాల వర్షాలతో పూత రాలిపోయింది. ప్రస్తుతం పంట దిగుబడి తగ్గి ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట సాగు చేసే సమయంలో క్వింటా ధరరూ.8,000 ఉండేది. దిగుబడి వస్తున్న సమయానికి (ప్రస్తుతం) రూ.5,100కు పడిపోయిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరా శనిగ సాగుకు రూ.15 వేలు ఖర్చు చేశామన్నారు. అదనంగా కౌలు రైతులు ఎకరాకు సుమారు రూ.10 వేలు భూ యజమానికి చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో ఎకరాకు రూ.25వేలు ఖర్చు వస్తోంది. దిగుబడి ఎకరాకు ఐదు క్వింటాళ్లు రావడంతో, క్వింటా రూ.25 వేలు అమ్మితే గిట్టుబాటు అవుతుందని పేర్కొంటున్నారు. తమ శ్రమ అంతా వృథా అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ.5,620 మద్దతు ధరను శనగకు ప్రకటించింది కానీ సంబంధిత కొనుగోలు కేంద్రాలను ఇంకా ఏర్పాటు చేయలేదు. 2023లో ప్రభుత్వ సంస్థ మార్క్‌ఫెడ్ ఒక క్వింటా రూ.4,750తో శనిగలను కొనుగోలు చేసింది. ప్రస్తుతం ప్రభుత్వం కొనుగోలు మొదలు పెట్టకపోవడంతో బాడుగలు చెల్లించి వేర్‌హౌస్ గోడౌన్లలో రైతులు శనిగలను నిలువ చేసుకున్నారు. పట్టణంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రం లేదు. స్థానికంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా బోరు వేయించి ఇస్తే బాగుంటుందని పొట్లదుర్తి గ్రామ రైతులు భైరవ కొండారెడ్డి, లక్ష్మీదేవమ్మ కోరుతున్నారు.

అకాల వర్షాలతో దిగుబడి తగ్గింది

సొంత భూమి15 ఎకరాలు, కౌలుకు మరో 15ఎకరాలు తీసుకుని శనగ సాగు చేశాను. అకాల వర్షాలతో దిగుబడి తగ్గింది. అయిదు క్వింటాళ్లు వచ్చింది. మూడు నెలల క్రితం శనిగ క్వింటా రూ.8 వేలు ధర పలికింది. ప్రస్తుతం రూ.5000కు దళారులు అడు గుతున్నారు. ఈ పరిస్థితిలో శనగలు అమ్మకుండా వేర్ హౌస్ గోడౌన్లలో నిల్వ ఉంచుకున్నాను. రేటు వస్తే అమ్మాలని అనుకుంటున్నాను. ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- హరి, రైతు

కొనుగోలు కేంద్రం ప్రారంభించలేదు

30 ఎకరాల్లో శనగ పంట వేశాను. దిగుబడి ఎకరాకు ఐదు మూటలు వచ్చింది. ఆలస్యంగా పంట చేతికి వచ్చింది. ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు కేం ద్రాన్ని ప్రారంభించలేదు. శనగలు అమ్ముకునేందుకు గిరాకీ లేదు. తాము అడిగిన ధరకు ఇవ్వాలని దళారులు బెదిరి స్తున్నారు. విధి లేక క్వింటాకు 4కిలోల తరుగుతో రూ.5,100 ధరతో అమ్ముకున్నాం. ఆరు గాలం కష్టించిన శ్రమ వృథా అయింది. గోడౌన్లలో దాచుకోవాలంటే ఖర్చు వస్తుంది.

- కొండారెడ్డి, రైతు

దిగుబడి తగ్గినట్లు సమాచారం

శనగ పంటకు కొనుగోలు కేంద్రాలు రావాల్సి ఉంది. దిగుబడి ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్లు వచ్చినట్లు సమాచారం. దిగుబడి తగ్గింది. ప్రభుత్వం నుంచి క్వింటా శనిగ రూ.5,620 ధర ప్రకటించింది. మండల వ్యాప్తంగా తొమ్మిది వేల ఎకరాలలో కంది సాగు చేశారు. కందులు అమ్మ దలుచుకున్న వారు రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. సెల్‌కు మెసేజ్ వచ్చాక ముద్దనూరులోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అమ్ము కోవచ్చు.

- శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయాధికారి


గోడౌన్‌లో నిల్వ ఉన్న శనగలు

సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

సైన్స్ పట్ల ప్రతి విద్యార్థి మక్కువ పెంచుకొని, ప్రయోగాలు చేపట్టాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న పేర్కొన్నారు. గురువారం స్థానిక శ్రీనివాస పాఠ శాలలో జాతీయ సైన్స్ దినోత్సవ ముందస్తు వేడు కల్లో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమాజ అభివృద్ధిలో సైన్స్ పాత్ర అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో శాస్త్రవేత్తల పాత్ర చాలా గొప్పదన్నా0రు. శాస్త్రీయ దృక్పథాన్ని అవలంభిచడం ద్వారానే సమాజ అభివృద్ధి వేగవంతం అవుతుందని తెలిపారు. కొంతమంది మోసగాళ్లు సైన్స్ మ్యాజిక్ ప్రయోగాలు చేస్తూ మాయలు, మహత్యాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, వాటిని తిప్పికొట్టాలని విద్యార్థులను కోరారు. కంప్యూటర్ యుగంలో మూఢనమ్మకాలను నమ్మరాదన్నారు. జన విజ్ఞాన వేదిక నాయకురాలు వై ఆరుణ, పాఠశాల కరస్పాండెంట్ కేశవులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి పిల్లలు ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం మూఢ నమ్మకాలతో ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో మ్యాజిక్ ప్రక్రియలను విద్యార్థులచే చేయించారు. ఐస్ గడ్డమీద పాలకుండ పెట్టి పాలను పొంగించారు. సలసలా కాగే నూనెలో నుంచి కాలే జ్జీలను ఖాళీ చేత్తోనే బయటికి తీశారు. ఈ ప్రక్రియలో వాటి వెనక ఉన్నదంతా సైన్స్ అని విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో జెవివి మండల నాయకులు డి.శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఐస్ గడ్డమీద పాలను పొంగిస్తున్న జెవివి నాయకులు

దేశం గర్వించదగ్గ నేత చంద్రశేఖర్ ఆజాద్


ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి ప్రాణాలు వదిలిన గొప్ప దేశభక్తుడు చంద్రశేఖర్ ఆజాద్ అని, ఆయన స్ఫూర్తితో కడప ఉక్కుకోసం పోరాడదామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్, డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ పిలుపునిచ్చారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటం వద్ద ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ దేశం గర్వించదగ్గ నేత అన్నారు. రాబోవు రోజుల్లో కడప ఉక్కు కోసం పోరాటాలు సాగిస్తామని, ఇందులో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అజయ్, సిఐటియు కార్యదర్శి రాఘవ, డివైఎఫ్ఐ సభ్యులు శ్రీను పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి చంద్రశేఖర్ ఆజాద్

జమ్మలమడుగు రూరల్ : దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు చంద్రశేఖర్ ఆజాద్ అని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో ఆజాద్ చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు సుబహన్, యాసిన్, నిఖిల్, జగన్ పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'ఎస్ఆర్ఐటి' ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో డిసెంబర్ 2024-జనవరి 25లో ఫస్ట్ బి.టెక్, ఎంబిఎ ఫస్ట్ సెమిస్టర్ విద్యార్థులకు నిర్వహించిన అటానమస్ ఫలితాల్లో విద్యార్థుల మంచి ప్రతిభ సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వివరాలను పేర్కొన్నారు. మంచి మార్కులు సాధించి కళాశాల మొదటి, రెండవ, మూడవ స్థానాలను దక్కించుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఒడిలు, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఆర్జీయూకేటీ విసి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో అభియంత్ టెక్నికల్ ఎక్స్‌పో 2025ను ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్ అట్టహాసంగా ప్రారంభించారు. విద్యార్థులు చేపట్టిన ప్రయోగ ప్రదర్శనలను వైస్ ఛాన్సలర్ సందర్శించారు. అనంతరం వాటి గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మూడు రోజులపాటు అభియంత్ టెక్నికల్ నిర్వహించడం సంతోషకరమని చెప్పారు. అనంతరం అభియంత్ టెక్నికల్ ఎక్స్‌పో సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, డీన్ అకడమిక్స్ రమేష్ కైలాస్, అనిల్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ఆర్‌డి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మండలం పరిధిలోని కామనూరు పిహెచ్‌సిని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారి శ్రీనివాస్‌తో ఈహెచ్ఆర్ నమోదు, మందుల కొరత ఏమైనా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సి కాన్పులు జరిగేలా చూడాలని సూచించారు. సిబ్బందితో కలసి ఆసుపత్రి గదులు, పరిసరాలను గమనించి సూచనలు చేశారు. అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించాలన్నారు. ఇప్పటివరకు సాధించిన ప్రగతిని డాక్టర్ శ్రీనివాస్ వివరించగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. మరో వైద్యాధికారి హనీఫ్ బాబా ఫీల్డ్‌లో గోపవరం రెండో సచివాలయం లింగారెడ్డి కొట్టాలలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌లో ఉంటూ అక్కడ అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, ఇన్‌ఛార్జి స్టాఫ్‌నర్స్ రాధ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

- గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ వినతిపత్రం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ గెస్ట్ ఫ్యాకల్టీల సమస్యల పరిష్కారానికి సంబంధించి ఎపి హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్‌ను కోరారు. గురువారం ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటికి విచ్చేసిన విసిని గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ తరపున వినతిపత్రం అందజేశారు. హైకోర్టు తీర్పు ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు అధికార పక్షం వ్యవహరిస్తోందని, తమకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లి గవర్నర్ కౌన్సిల్లో ప్రవేశ పెడతామని, సాధ్యమైనంత త్వరలో సమస్యకు పరిష్కారాన్ని వెతుకుతామని వైస్ ఛాన్సలర్ హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక సూపర్‌బజార్ రోడ్డులో పలువురు పార్కింగ్ లేకుండా నిర్మాణాలు చేపట్టారని, హాస్పిటల్లో పార్కింగ్ లేనేలేదని, ఇప్పుడు కొత్తగా నిర్మాణాలు చేస్తున్న హాస్పిటళ్లల్లో పార్కింగ్ లేదని మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్ రెడ్డి, రాయలసీమ విద్యార్థి సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. కమిషనర్ తక్షణం పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాలన్నారు. పలు కాలేజీలు కూడా పార్కింగ్ లేకుండా ఉన్నాయని తెలిపారు. సూపర్ బజార్ రోడ్డు ట్రాఫిక్ విషయంలో మహానగరాలను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. హాస్పిటల్స్ నిర్వాహకులు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ నిరంతరం సరఫరా చేయాలి

- విద్యుత్ శాఖాధికారికి ఎంపిజె వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రంజాన్ మాసంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టీస్ (ఎంపిజె) సభ్యులు కోరారు. ఆ మేరకు గురువారం విద్యుత్ అధికారి రమణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 2 నుండి రంజాన్ మాసం ప్రారంభం కాబోతుందన్నారు. మార్చి 31వరకు ప్రొద్దుటూరు పట్టణంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎక్కడ కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని వారు కోరారు. సెహర్, ఇఫ్తార్ (ఉపవాసం మొదలు, ముగింపు) సమయాల్లో అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి, పట్టణ అధ్యక్షుడు హుశేన్‌బాషా, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై పరిశోధనలు చేపట్టాలి

ప్రజాశక్తి - చాపాడు

రాయలసీమ ప్రాంతంలో పండ్లు, పసుపు, ఉల్లి విస్తారంగా పండిస్తున్నారని, వాటి అభివృద్ధికి పరిశోధనలు చేపట్టాలని పసుపు రైతు సంఘం నాయకులు గుండంరాజు సుబ్బయ్య, బిపి ప్రతాప్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాతపూర్వకంగా విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరటిపంట జిల్లాలో అత్యధికంగా పండిస్తున్నారన్నారు. దేశ, విదేశాలకు ఎగుమతులు చేపడుతున్నారన్నారు. ప్రత్యేక పరిశోధనలు, విద్యా బోధన తప్పక ఉండాలన్నారు. తమ రాయలసీమ పైన దయతో ఉద్యానవన పంటలపైన పరిశోధనలు ప్రత్యేకంగా కొనసాగించాలని కోరారు.


దెబ్బతిన్న కారు

విరిగిన విద్యుత్ స్తంభం

- జనాలు లేకపోవడంతో తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

గురువారం పట్టణ పరిధిలోని సదాశివారెడ్డి హాస్పిటల్ పక్కన ఉన్న మున్సిపాలిటీ మస్టర్ సెంటర్ ప్రహరీ కూలడంతో కరెంటు స్తంభం విరిగిపోయింది. ఆ సమయంలో అక్కడ జనాలు లేకపోవడంతో పెను ప్రమా దం తప్పింది. కొన్నేళ్ల నుంచి ప్రహరీ మురికి కాలువ పక్కన ఉండడంతో పడిపోయే స్థితికి వచ్చిందని, స్థానికులు అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతిరోజు ఈ ప్రహరీ కింద మున్సిపల్ కార్యాలయ సిబ్బంది సేద తీర్చుకునేవారని, గురువారం మధ్యాహ్నం వరకే డ్యూటీ ఉండడంతో ఇంటికి వెళ్లారని, లేకుంటే ప్రాణనష్టం జరిగేదని ప్రజలు తెలిపారు. ఈ సంఘటనలో కారు దెబ్బతింది. విద్యుత్ స్తంభం పడి పోవడం వల్ల ఈ ప్రాంతంలోని టివిలు, ఫ్రిజులు కాలిపోయాయని స్థానికులు తెలిపారు.

తెలుగుగంగ ఆయకట్టుకు నీరు విడుదల చేయాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

తెలుగుగంగ ఆయకట్టు రైతులకు నీరు విడుదల చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. మైదుకూరు మండలం వనిపెంటలో తెలుగుగంగ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవి రమణ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యంతో ఆయకట్టు రైతులకు నీరు సక్రమంగా అందని పరిస్థితి నెలకొందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో ఏ సమయంలో అతివృష్టి, అనావృష్టి వస్తుందోనని రైతుల్లో ఆందోళన ఉందన్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టులో ఉన్న నీటిని ఆయకట్టు రైతులందరూ ఐక్యమై రాష్ట్ర ప్రభుత్వంతో ప్రశ్నించి ప్రాజెక్టు పరిధిలో పూడ్చివేసిన పంట, పిల్ల కాలువలకు మరమ్మతులు చేయించి, పొలాలకు నీరు విడుదలయ్యేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, జిల్లా సమితి సభ్యుడు రామాంజనేయరెడ్డి, రైతులు తిప్పిరెడ్డిపల్లెకు చెందిన కోటయ్యగారి గుర్రప్ప, గురుమోహన్, కొత్తపల్లెకు చెందిన బండి నాగభూషణం, బాలయ్య, మిట్టమానుపల్లెకు చెందిన పోతురాజు వెంకటయ్య, పప్పనపల్లె నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై నోరు విప్పకపోవడం శోచనీయం

- పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రానికి సంజీవని వంటి ప్రత్యేకహోదాపై సిఎం చంద్రబాబు, వైసిపి అధినేత వైఎస్ జగన్‌రెడ్డి నోరు విప్పకపోవడం శోచనీయమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబుకు స్వర్ణాంధ్ర 2047 పిచ్చి పట్టగా.. జగన్‌రెడ్డికి ప్రతిపక్ష నాయకుడి హోదా పిచ్చి పట్టుకుందని ఎద్దేవా చేశారు. సిఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047 గురించి పదేపదే ప్రస్తావించడం హాస్యాస్పదమన్నారు. టిడిపి కూటమికి ప్రజలు అధికారం ఇచ్చింది 2029 వరకు మాత్రమే అన్నారు. ఆలోపు ఏమి చేస్తారో కూటమి ప్రభుత్వం చెబితే సమంజసంగా ఉంటుందని పేర్కొన్నారు. వీరు వారి నినాదాలను పక్కనపెట్టి రాష్ట్రానికి ప్రత్యేకహోదా కోసం పోరాడాలని సూచించారు.

పులివెందుల అభివృద్ధికి పెద్దపీట వేయండి

- మంత్రి లోకేష్‌ను కలిసిన సింగారెడ్డి జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గం అభివృద్ధికి పెద్ద పీట వేయాలని టిడిపి నేత సింగారెడ్డి జయచంద్రారెడ్డి కోరారు. గురువారం విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో ఉన్న ఐటి శాఖ మంత్రి లోకేష్‌ను ఆయన కలిసి పనులకు నిధులు మంజూరు చేయా లని వినతిపత్రం అంద జేశారు. నిధుల్లేక అభివృద్ధి పనులు నిలిచిపోయినట్లు చెప్పారు. పార్టీ కోసం పని చేసిన టిడిపి నేతలకు సమస్యలు ఉన్నాయని వాటిపై కూడా దృష్టి పెట్టాల న్నారు. అనంతరం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని కూడా కలిశారు. మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో టిడిపి నేతలు సాయి కృష్ణారెడ్డి, జయశంకర్ రెడ్డి, ఆకుల సురేష్ పాల్గొన్నారు.